# సింగిల్ పేజి కథలు

# ప్రమోషన్

**అప్పటివరకు పిల్లల అల్లరితో దద్దరిల్లిన వివేక్ ప్రసాద్ ఇల్లు ఒక్కసారిగా తుఫాన్ ముందు ప్రశాంతతలా నిశ్శబ్దంగా మారింది. "ఏంటిరా! డాడీ వచ్చారా ఏంటి?" అని వంట గదిలోంచే అరిచింది వాణీ.**

పిల్లలు బంటి, పప్పీ, వివేక్‌ప్రసాద్ బైక్ శబ్దం వింటూనే అటెన్షన్ అయిపోయారు. వాణీకి సమాధానం కూడా చెప్పకుండానే పుస్తకాల్లో లీనమైపోయారు.

"ఏంటో! ఈ పిల్లలు డాడీ ఉంటే ఒకలాగా, లేకపోతే మరోలా ప్రవర్తిస్తారు. అయినా ఈయన్ను అనాలి. ఇంట్లో అడుగుపెట్టింది మొదలు వాళ్లను వేపుకుతినేస్తారు. వాళ్లకూ మనసుంటుందని, డాడీతో సంతోషంగా గడపాలని కోరుతుంటారని, అస్సలు గమనించరు, ప్చ్... ఈయనతో వేగలేక ఛస్తున్నాను" సొణుక్కుంది వాణీ.

వివేక్‌ప్రసాద్ 'పెర్‌ఫెక్షనిస్ట్'. అందరూ తనలాగా ఉండాలనుకునే మనస్తత్వం. ఇంటిలో అన్నీ తీర్చదిద్దినట్లుగా ఉండాలి, ఏమైనా తేడాలొస్తే, అస్సలు సహించడు. కడిగిపారేస్తాడు. ముఖ్యంగా పిల్లల విషయంలో మరీ స్ట్రిక్ట్. సెలవు రోజుల్లో తను ఇంట్లో ఉంటే, పిల్లలకు సింహం బోనులో పెట్టి బంధించినట్లుగా ఉంటుంది. ఫుట్‌బాల్ మేచ్ రిఫరీలాగా, వాళ్లమీద ఆంక్షలు విధిస్తాడు. అందుకే పిల్లలకు అతనంటే చచ్చేంత భయం.

ఇంట్లోకి అడుగుపెడుతూనే వివేక్‌ప్రసాద్ పొలికేక పెట్టాడు. "ఒరేయ్, బంటి, పప్పీ హోంవర్కు చేశార్రా? నేను ఫ్రెష్ అయి వచ్చేలోగా చూపించాలి తెలిసిందా?" అంటూ పెద్దవాడైన బంటి చెవి గట్టిగా మెలేశాడు. కన్నీళ్లు గుడ్లలోనే కుక్కుకుని ఏడుపు ఆపుకున్నాడు. బంటి, పప్పీ పై ప్రాణాలు పైనే పోయాయి.

"వాణీ, కాఫీ రెడీ చెయ్, కాఫీ పొడి సరిగ్గా ఒకటిన్నర స్పూన్స్ వెయ్యి. ఏంటో, ఇన్నేళ్లయినా ఇంకా కాఫీ పెర్‌ఫెక్ట్‌గా కలపడం రాదు నీకు" విసుక్కుంటూ ఆర్డర్ పాస్ చేశాడు.

'ఛీ, ఎంత చేసినా తృప్తి లేదు ఈ పాడు ముఖానికి. ఎప్పుడూ ధుమధుమలాడుతుంటాడు. నిప్పులకుంపటిలా' మనసులో అనుకుంది వాణి.


వివేక్‌ప్రసాద్ బాత్రూంలో దూరడం చూసి ఊపిరి పీల్చుకున్నారు పిల్లలు.

"ఐ హేట్ డాడ్, డాడీ మనల్ని లవ్ చెయ్యర్రా అన్నయ్యా" అన్నాడు పప్పీ సీరియస్‌గా హోంవర్క్ చేస్తున్న బంటీని చూస్తూ.

"అవున్రా తమ్ముడూ, మన బబ్లి వాళ్ల డాడీ వాడిని ఎంత లవ్ చేస్తారో, వాడ్ని ఎప్పుడూ కొట్టరు, తిట్టరు, సినిమాలకి, పార్క్‌లకి తీసుకెళ్తారు. మనకీ అలాంటి డాడీ ఉంటే ఎంత బావున్నో... పోనీలే ఏం చేస్తాం... తొందరగా హోంవర్క్ పూర్తి కానీరా, లేదంటే నీ చెవి కూడా దద్దురెక్కిపోగలదు" అని తమ్ముడికి హితవు చెప్పాడు బంటి, ఎర్రగా కందిపోయిన తన చెవిని తడుముకుంటూ.

* * *

ఆఫీసులో, వివేక్‌ప్రసాద్‌కి రోజులు చాలా భారంగా



గడుస్తున్నాయి. ఇంతకుముందున్న బాస్‌కి వివేక్‌ప్రసాదంటే చాలా గురి. యూ ఆర్ ఏ జీనియస్, అంటూ మొత్తం బాధ్యతను తనకే అప్పజెప్పేవాడు. కానీ కొత్తగా వచ్చిన బాస్ ప్రతీ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటున్నాడు. ఎవర్నీ నమ్మటం లేదు. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం అలవాటయిన వివేక్‌ప్రసాద్, కొత్త బాస్ వద్ద ఇమడడానికి చాలా కష్టపడాల్సి వస్తుంది. విచారంగా కూర్చుని ఆలోచిస్తున్న వివేక్‌ప్రసాద్, "సార్! మిమ్మల్ని పిలుస్తుండు" అన్న బాయ్ సైదులు మాటల్తో, ఉలిక్కిపడి, స్ప్రింగ్‌లా లేచి, బాస్ కేబిన్ వైపు నడిచాడు. వివేక్‌ప్రసాద్‌ని చూస్తూనే బాస్ నరసింహావతారం ఎత్తాడు.

"వాట్ హెల్ ఈజ్ దిస్, వివేక్. ఈ రిపోర్ట్ చూడు, అంతా తప్పులతడక, ఐ కాంట్ బేర్ దిస్. ఈ విధంగానా పనిచేసేది, మీకు జీతాలివ్వడం దండగయ్యా" అంటూ రిపోర్ట్ పేపర్స్ విసిరికొట్టాడు.

కాళ్లకింద భూమి కంపించినట్లు ఫీలయ్యాడు వివేక్ ప్రసాద్. జీవితంలో మొదటిసారి ఇటువంటి చేదు సంఘటన ఎదురయ్యింది తనకు. కాళ్లీడ్చుకుంటూ, భుజాలు వేళ్లాడదీసుకుని, దిగులుగా కేబిన్ నుండి బయటపడి, తన కుర్చీలో చేరగిలపడ్డాడు. స్టాఫంతా తననే వట్టి వట్టి చూడడం, కొందరు నవ్వుకోవడం గమనించి తల తీసేసినట్లు ఫీలయ్యాడు. 'తను ఎంత సిన్సియర్‌గా పనిచేస్తున్నా, ఎందుకు ఈ విధంగా జరుగుతుంది, ఈ ఆఫీసర్ వచ్చి నెలరోజులు కూడా కాలేదు, కానీ పరిస్థితి ఎంత మారిపోయింది. 'ఆ' అంటే తప్పు 'ఊ' అంటే తప్పు.. షిట్, దినమొక గండంగా గడుస్తుంది" జీవితంలో బహుశా మొదటిసారి, వివేక్‌ప్రసాద్ వివేకంతో తన్నుతాను ప్రశ్నించుకున్నాడు.

"తనూ, తన బాస్‌లాగే ఇంట్లో ప్రవర్తిస్తున్నాడా? వాణీ, పిల్లలు కూడా నాలాగే బాధపడుతున్నారా? క్రమశిక్షణ పేరుతో పిల్లలకు నేను దూరమవ్వట్లేదు కదా? పిల్లలు నన్ను చూస్తూనే ఆమడదూరం పరిగెడుతున్నారు. ఏనాడూ వాళ్లను ప్రేమగా దగ్గరకు తీసుకుని సరదాగా గడపలేదు. ఛీ...ఆలోచిస్తుంటే నా మీద నాకు అసహ్యం వేస్తుంది.. వారం క్రితం అనుకుంటా, పప్పీ పుట్టినరోజునాడు, నా ఫ్రెండ్స్‌ని డిన్నర్‌కి పిలిచాను. పాపం, వాణీ కింద మీద పడి రకరకాల వంటలు చేసింది. కానీ నేను ఎంత అమానుషంగా ప్రవర్తించాను. ఫ్రెండ్స్ ఏమనుకుంటారోనన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా, చికెన్ బిరియానీలో కొద్దిగా ఉప్పు ఎక్కువయ్యిందని, వాళ్ల ముందే వాణీని నానా మాటలన్నాను. ముఖం చిన్నబుచ్చుకుని వంటగదిలోకి పోయి, వాణీ వెక్కి వెక్కి ఏడ్వడం గమనించాను కానీ, తనను ఓదార్చడానికి నాకు అహం అడ్డువచ్చింది. ఇప్పుడు ఆఫీసర్ కేబిన్‌లో నన్ను తిడితేనే ఇంత బాధపడుతున్నాను. పాపం...వాణి.." పశ్చాత్తాపంతో వివేక్ ప్రసాద్ గుండె భారంగా మారింది. తన ప్రమేయం లేకుండానే కళ్లు చెమర్చాయి.

* * *

సాయంత్రం ఇంటికి వెళ్లడానికి వివేక్‌ప్రసాద్ సిద్ధమవుతుండగా, సైదులు మళ్లీ వచ్చి చెప్పాడు, బాస్ పిలుస్తున్నాడని. ఇంకేం ముంచుకొచ్చిందోనని, ఆందోళనపడుతూ వివేక్‌ప్రసాద్ నెమ్మదిగా పిల్లిలా, బాస్ కేబిన్‌లోకి అడుగుపెట్టాడు. "టేక్ యువర్ సీట్" అని బాస్ అనడంతో తన్నితానే నమ్మలేక, ఆశ్చర్యపడుతూ ఎదురుగా ఉన్న కుర్చీలో కుదురుగా కూర్చున్నాడు.

బాస్ చాలా ప్రశాంతంగా చెప్పాడు- "మై డియర్ వివేక్, ఐయాం సారీ! రిపోర్ట్‌లు తారుమారవ్వడం గమనించాను. లాస్ట్ ఇయర్ రిపోర్ట్‌ని నేను పొరపాటుగా లేటెస్టదని భావించి, నిన్ను బాధపెట్టాను. నువ్వు ప్రిపేర్ చేసిన ఫ్రెష్ రిపోర్ట్‌ని ఇప్పుడే చూశాను. యు హేవ్ డన్ ఎ గ్రేట్ జాబ్, ఎక్స్‌లెంట్"

వివేక్ కళ్లల్లో నీళ్లు లీలగా తిరిగాయి, బలవంతంగా తన్ను తాను కంట్రోల్ చేసుకున్నాడు. మళ్లీ అందుకు

న్నాడు బాస్. "నీకొక సర్‌ప్రైజ్ న్యూస్, ఇప్పుడే హెడ్ ఆఫీస్ నుండి మెసేజ్ వచ్చింది. నీ సిన్సియారిటీకి, హార్డ్‌వర్క్‌కి మెచ్చి, నీకు ప్రమోషన్ ఇచ్చారు. ఆర్డర్స్ త్వరలో వస్తాయి, కంగ్రాట్స్"

వివేక్‌కి ఇదంతా కలలా ఉంది, లేచి ఆనందంగా నాట్యం చేయాలని ఉంది.

వివేక్‌ప్రసాద్, ఆఫీస్ నుండి ఇంటికి వెళ్తూ దారిలో వాణీకి, పిల్లలకు స్వీట్స్, కొత్తబట్టలు తీసుకున్నాడు. "బహుశా, మనిషి మానవత్వాన్ని కోల్పోకుండా, ఒక మంచి వ్యక్తిగా మెలగడానికే కాబోలు భగవంతుడు ప్రతి ఒక్కరికీ సుఖాలతో బాటూ కష్టాల రుచిని కూడా మధ్య మధ్యలో చవిచూపిస్తుంటాడు. ఇక నుండి వాణీని, పిల్లలను నొప్పించక, పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను" అని గట్టిగా నిర్ణయించుకుని, బైక్‌ని స్టార్ట్ చేసి ఇంటి వైపు సుడిగాలిలా దూసుకుపోయాడు.

వివేక్ ప్రసాద్ ఆఫీస్‌లో ఒక ప్రమోషన్ మాత్రమే సాధించాడు, కానీ ఇంటిలో రెండు ప్రమోషన్లు కొట్టేయడానికి, ఇప్పటి నుండే పెర్‌ఫెక్ట్‌గా పనిచేయడం మొదలెట్టాడు. ఆ ప్రమోషన్లు ఏమంటారా? ఒకటి వాణీకి మంచి భర్తగా, రెండు బంటి-పప్పీకి మంచి తండ్రిగా.

**-కరణపు శ్రీనివాస్ (నవీ ముంబాయి)**

***

# మూలం

**"ఏయ్, మేస్త్రీ...! ఆ ముసలోడ్ని పనిలోకి తెచ్చావంటే ఒక్క మస్టర్ కూడా రాయను. రేపటి నుంచి అతను సైట్లో కనిపిస్తే నేనొప్పుకోను!"**

"దొరా! నీవే, ఓ కంట చూడాలి దొరా..!" అతని మాటలు పూర్తికాకముందే అందుకుని, "ఇంకేం కథలు చెప్పొద్దు..." "పనికొచ్చారా...! ఆడుకోవడానికి వచ్చారా! కంపెనీ సొమ్ము అప్పనంగా తీసుకుందామనుకుంటున్నారా..!" నిప్పులు చెరుగుతూ అన్నాడు అనంత్.

నీళ్లు నములుతూ నిలబడిపోయాడు లేబర్ మేస్త్రీ..!

కోపంతో ముఖం కందగడ్డలాగ తయారయింది కంఠస్వరం స్థాయి పెరగడంతో పనివాళ్లంతా తలెత్తి ఇటే చూస్తున్నారు.

గుడ్లనీరు కక్కుకుంటూ ఓ పక్కకు నిల్చున్నాడు ముసలతను..! అతని కన్నీటిని చూసినా, ఏమాత్రం చలించలేదు అనంత్..!

"నా ముందు లేకుండా వెళ్లిపోండి..! ఎదురుగా ఉంటే నేనేమి చేస్తానో నాకే తెలియదు!" గట్టిగా అరిచాడు.

మౌనంగా తలవంచుకుని అక్కడి నుండి వెళ్లిపోయారు వాళ్లు.

* * *

"ఎంతయినా చెప్పు..! నీదే పొరపాటు...!" అన్నాడు శ్రీధర్ అన్నం కలుపుకుంటూ!

"నీవు కూడా అలా అంటావేరా! పనిచేయలేని ముసలాడ్ని పనిలోకి తీసుకురావడం పొరపాటు కాదా!" నిలదీశాడు అనంత్. చారు వేసుకుంటూ!

"నీ వాదన కరెక్టే కాదనను! కానీ అతని కోణం నుంచి ఓసారి ఆలోచించు. అదీ కాక యాభై మంది కూలోల్లలో ఒక్క ముసలతను ఉంటే మునిగేదేముంది..!" సూటిగా అనంత్ వైపు చూస్తూ ప్రశ్నించాడు శ్రీధర్.!

శ్రీధర్, అనంత్ సహోద్యోగులు! ఆ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో, ఇద్దరూ ఒకేసారి చేరారు. వేరువేరు ప్రదేశాల నుండి వచ్చినా, త్వరలోనే మంచి స్నేహితులుగా మారారు. ఉదయం సైట్లో జరిగిన విషయం లేబర్ మేస్త్రీ శ్రీధర్‌తో చెప్పుకుని, ఎలాగైనా అనంత్‌కు సర్దిచెప్పమని బ్రతిమిలాడాడు.

"అయితే...! నీవనేది ఏమిటి?"

"నీకు, ఇంకా అర్థం కాలేదా! చెప్తావిను! ఎన్ని ఇబ్బందులు లేకుంటే శరీరం సహకరించకపోయినా పనిలోకి వస్తాడు..! ఈ మండుటెండలలో పనెందుకు చేస్తాడు! అతని పరిస్థితి ఏమిటో మనకెలా తెలుస్తుంది? అయినా, అలాంటి వారిని చూసి, చూడనట్లు వదిలివేయాలే గానీ, ఇంతదాకా తీసుకురావడం మానవత్వం అవుతుందా.. ఆలోచించు!"

శ్రీధర్ మాటలతో ఏ మూలో చిన్నపాటి సంచలనం. అప్పటివరకు కమ్ముకున్న అహంభావపు పొరలు తొలగిపోతున్న భావన!ఒక్కసారిగా తన పునాదులలోని ఆలోచనలు దూసుకుపోయాయి. ఓ సాధారణ కుటుంబంలో పుట్టాడు. ఓ పూట తిండి మానుకుని తనను చదివించిన తల్లిదండ్రులు గుర్తుకు వచ్చారు! ఫీజుకు డబ్బుల్లేక ఇబ్బంది పడిన రోజులు సజీవంగా కళ్లముందు తేలియాడడం మొదలుపెట్టాయి.

తను ఓ సైట్‌కు ఇన్‌చార్జి కావడానికి బీజం ఆ కూలి పనిలోనే. ఆ పని వలనే తానంటూ ఒకడు నిలబడగలిగింది...! అంతా సినిమా రీలులాగ కళ్ల ముందు తిరగడంతో అంతరంగం అల్లకల్లోలమైంది.

తను ఈ స్థాయిలో ఉన్నా తండ్రి ఇంకా కూలికి పోతూ, జీవనాధారాన్ని వెదుక్కుంటున్నాడు! తను మాత్రం కంపెనీ ఇచ్చే విలాసాలను అనుభవిస్తూ, తన మూలాలనే మర్చిపోయాడు. అప్పటివరకు కమ్ముకున్న అహంభావపు పొరలు నెమ్మదిగా కరిగిపోసాగాయి.

తను ఈ స్థాయికి ఎదగడానికి తన అరచేతులను సోపానాలుగా పెట్టిన తండ్రి చేతులకు ఇక మట్టి అంటడానికి వీలు లేదు.

తక్షణమే ఆ దిశగా ప్రణాళికను రూపొందించాడు.

"చాలా థాంక్స్‌రా శ్రీధర్..! నా కళ్లు తెరిపించావు!"

"థాంక్స్ దేనికిరా, నిజానిజాలు తేల్చి చెప్పాను. నీవు సహృదయంతో అర్థం చేసుకున్నావు!" నవ్వుతూ చూశాడు. మార్పు తీసుకురాగలిగాననే గర్వం ఆ నవ్వులో..!

* * *

పనివాళ్లతో ప్రశాంతంగా మాట్లాడుతూ, ముందు కంటే ఎక్కువ పనిని రాబట్టుకుంటున్నాడు. "నిన్నటి వరకు కర్కోటకుడు అన్న పనివాళ్లు ఇప్పుడు పుణ్యాత్ముడు, మహానుభావుడు!" అని పొగుడుతున్నారు.

విచిత్రంగా ఇప్పుడు రాత్రిళ్లు హాయిగా నిద్రపడుతోంది అనంత్‌కు.

**-రమణ కాకర్ల (గుడిపాటిపల్లి)**

